క్లుప్తంగా

పడకేసిన పారిశుధ్యం



గొల్లపల్లి ప్రధాన రహదారి పక్కన పేరుకుపోయిన మురుగు నీరు

పెనుకొండ రూరల్: డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో అధిక సంఖ్యలో నమోదు అవుతున్నాయి. సంబంధిత పీహెచ్‌సీల్లో రోజూ పదుల సంఖ్యలో ఓపీలు నమోదు అవుతున్నా అధికారులు మాత్రం పారిశుధ్యంపై చర్యలు చేపట్టడం లేదు. మండలంలోని దుద్దేబండ గ్రామంలో గొల్లపల్లి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే మురుగు నీరు పేరుకుపోయింది. దోమలు సైరవిహారం చేస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

సాయి భక్తుల భిక్షాటన

పెనుకొండ: పట్టణంలో ఆదివారం సాయి భక్తులు భిక్షాటన చేపట్టారు. ఈ నెల 21న గురుపౌర్ణమి వేడుకలు జరగనున్న నేపథ్యంలో సాయి భక్తులు ఇంటింటా తిరిగి భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ స్థానిక ఆల్విన్ కాలనీలోని సత్యసాయి, షిర్డీ సాయి ఆలయంలో గురుపౌర్ణమి రోజున పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు చేయనున్నట్లు వెల్లడించారు. భక్తులు వేడుకల్లో పాల్గొనాలని కోరారు. భిక్షాటన అనంతరం అన్నదానం చేశారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి



శిక్షణ ఇస్తున్న సీఆర్పీ పద్మావతి

అమరాపురం: స్థానిక మహిళా సమైక్య కార్యాలయం ఆవరణలో మహిళా సంఘాల బలోపేతంపై సీఆర్పీ పద్మావతి ఆధ్వర్యంలో ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని సంఘాల ఆర్థిక లావాదేవీలు ఏవిధంగా నిర్వహించాలి, పుస్తకాల నిర్వహణ, రుణాల వితరణ, రికవరీ తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా సంఘాల నిర్వహణ వల్ల కలిగే లాభాలు, ఆర్థికంగా ఎదుగుదల తదితర వాటిపై అవగాహన కల్పించారు. మండలంలో 1232 సంఘాలు ఉన్నాయని, అన్ని సంఘాల సభ్యులందరికీ శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు.

'జీపీఎస్'ను అమలు చేయొద్దు

రొళ్ల: జీపీఎస్ చట్టాన్ని రద్దుచేసి ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలను నెరవేరుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ చట్టాన్ని అమలు చేయడానికి సిద్ధమవడం దారుణమని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2023 అక్టోబర్ 20 నుంచి జీపీఎస్ చట్టం అమల్లోకి (అపాయింట్ డే) వచ్చినట్లు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజమ్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన జీఓ-54 జూన్ 12వ తేదీన జారీ చేసి ఇప్పటి వరకూ దాన్ని బయటకు పెట్టకపోవడం అన్యాయమన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



శిబిరంలో పాల్గొన్న కంటి బాధితులు

పావగడ: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో స్థానిక హెల్ప్ సొసైటీ, శంకర కంటి ఆస్పత్రి సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి కంటి రోగులు పోటెత్తారు. శంకర కంటి ఆస్పత్రికి చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణుడు అభిషేక్, లత ఆధ్వర్యంలో 200 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో శస్త్ర చికిత్సకు ఎంపికైన 62 మంది రోగులను బెంగుళూరులోని శంకర కంటి ఆస్పత్రికి తరలించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు వలల పంపిణీ

పావగడ: స్థానిక రామకృష్ణ సేవాశ్రమాధిపతి స్వామి జపానంద ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లోనే కాకుండా తమిళనాడు రాష్ట్రంలో కూడా వరద బాధితులకు ఆసరాగా నిలిచి ఔదార్యాన్ని చాటుకున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో తుపాను ప్రభావం సముద్ర తీర ప్రాంతాలను అతలాకుతలం చేసింది. దీంతో అప్పట్లోనే జపానందస్వామి సుమారు పది వేల మంది బాధితులకు పరిహారం అందించారు. తాజాగా ఆదివారం పేదరికంతో అల్లాడిపోతున్న కాయలపట్టినామ్ అనే సముద్ర తీరం ప్రాంతానికి చెందిన 175 మత్స్య కుటుంబాలను ఆదుకునేలా రూ.15 లక్షల విలువైన చేపలు పట్టే వలలను పంపిణీ చేశారు.

కొంచెం నీకు.. కొంచెం నాకు !

- ఎన్నికల సమయంలో రూ.లక్షల పంచాయతీ నిధుల స్వాహా
- చెయ్యని పనులకూ బిల్లులు
- పంచాయతీ కార్యదర్శి బంధువుల ఖాతాలకు నిధుల మళ్లింపు
- అన్నీ తెలిసినా పట్టించుకోని అధికారులు !


చిలమత్తూరు: ఎన్నికల సమయంలో పంచాయతీల ఖాతాల్లో భారీగా నిధులు జమ అయ్యాయి. ఎలాగైనా ఆ నిధులను స్వాహా చేయాలని ప్లాన్ చేశాడు ఓ పంచాయతీ కార్యదర్శి. అనుకున్నదే తడవుగా తన అధికారాన్ని అడ్డంపెట్టుకొని లక్షలాది రూపాయలు దోచేశాడు.

మండలంలో 12 పంచాయతీలు

చిలమత్తూరు మండలంలో మొత్తం 12 పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీలకు ఎన్నికల సమయంలో 15వ ఆర్థిక సంఘం నుంచి దాదాపు రూ.5 కోట్ల వరకూ నిధులు మంజూరు అయ్యాయి. ఇందులో భాగంగానే మొరసపల్లి, చాగలేరు, చిలమత్తూరు పంచాయతీలకు దాదాపుగా రూ.కోటి వరకూ నిధులు విడుదల చేశారు.

చక్రం తిప్పిన పంచాయతీ కార్యదర్శి

మండలంలోని మొరసపల్లి, చాగలేరు, చిలమత్తూరు పంచాయతీలకు రామ్లానాయక్ పంచాయతీ కార్యదర్శిగా ఉన్నారు. మొరసపల్లిలో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిగా ఆయన పనిచేస్తున్నారు. అలాగే చాగలేరు, చిలమత్తూరులకు కూడా ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. అయితే ఎన్నికల సమయంలో రామ్లానాయక్ పెద్ద ఎత్తున పంచాయతీ నిధులు పక్కదారి పట్టించారన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. 'మీకు బిల్లు పెట్టాలంటే తాను కూడా ఏదో పని పేరుతో బిల్లులు చేసుకుంటానంటూ స్థానిక ప్రజాప్రతినిధులకు అల్టిమేటం జారీచేసి మరీ లక్షలాది రూపాయలు తన బంధువుల ఖాతాలకు మళ్లించుకోవడం చర్చనీయాంశమైంది. ఆయా పంచాయతీలకు కోటి రూపాయలు నిధులు మంజూరు కాగా ఇందులో చేయని పనులకు బిల్లులు చేసుకొని దర్జాగా సొమ్ము కాజేశారు.



Scheme NameXV Finance Commission-XVFC					
State NameANDHRA PRADESH					
District Anantapur					
Block NameChilamathur					
Label.VILLAGENAME Chagaleru					
From - To 2024-04-01 - 2024-07-13					
5	XVFC/2023-24/P/4	2/13/2024	16000	R SAKI BAI--Citizen	Credited
6	XVFC/2023-24/P/5	2/13/2024	54000	R SAKI BAI--Citizen	Credited
1	XVFC/2024-25/P/1	4/12/2024	70000	R SAKI BAI--Citizen	Credited
7	XVFC/2024-25/P/4	6/13/2024	10000	R SAKI BAI--Citizen	Credited

చాగలేరు పంచాయితీలో సాకీబాయి ఖాతాకు నిధులు మళ్లిన వివరాలు

మూడు చోట్లా దోపిడీ

ఎన్నికల కోడ్ రాగానే పంచాయతీలకు భారీగా నిధులు వచ్చి చేరాయి. అప్పటి వరకూ చేసిన పనుల మాట సంగతేమో గానీ చేయని పనులకూ బిల్లులు చేసుకొని సొమ్ముచేసుకున్నారు. చాగలేరు పంచాయతీలో ఫిబ్రవరి నుంచి సాకీబాయ్ పేరుతో రూ.1,54,000 దారి మళ్లించారు. మొరసలపల్లి పంచాయతీలో రూ.2,50,000 అదే ఖాతాకు జమ చేశారు. మొత్తంగా రూ.4 లక్షలు రూపాయలు కార్యదర్శి బంధువు ఖాతాలో జమ చేసినట్లు చెబుతున్నారు. ఇక చిలమత్తూరు పంచాయతీలో సైతం సుమారు రూ. 5 లక్షలు మరొక మహిళ ఖాతాలో జమ చేసినట్లు తెలుస్తోంది. మండల స్థాయి అధికారి సహకారంతో పంచాయతీ కార్యదర్శి అవినీతికి తెరతీసినట్లు తెలుస్తోంది. సాధారణంగా సర్పంచు, వార్డు మెంబర్లు తీర్మానం మేరకు పనులు చేయించి బిల్లులు పెట్టుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ మూడు పంచాయతీల్లో ఆ తీర్మానాలు లేకుండానే బిల్లులు చేసుకున్నట్లు సమాచారం. ఎక్కువగా వీధిలైట్లు, శానిటేషన్ పనుల్లో అవినీతికి పాల్పడినట్లు చెబుతున్నారు.

అందరికీ తెలిసినా...

మొరసపల్లి, చాగలేరు, చిలమత్తూరు పంచాయతీల్లో జరుగుతున్న అవినీతి మండలంలో ఉండే అధికారులకు తెలిసే జరిగిందన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ముఖ్యంగా మొరసలపల్లి, చాగలేరు పంచాయతీల్లో సాకీ భాయ్ పేరు ఉన్న ఖాతాకు లక్షలాది రూపాయలు నిధులు మళ్లించారు. ఇంత జరుగుతున్నా నిధుల దారి మళ్లింపు విషయం బయటకు పొక్కకుండా చూసుకున్నారు సదరు కార్యదర్శి. కనీసం ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిధుల గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మెసేజ్ మాత్రమే వచ్చింది...

మొరసలపల్లి పంచాయతీలో ఈ ఏడాది జూన్ 5, 19వ తేదీల్లో సాకీబాయ్ అనే ఖాతాలోకి రూ.50 వేల బిల్లులు పడ్డాయి. ఏం పనులు చేశారో చెప్పండి అని స్థానిక సర్పంచ్ వెంకటమ్మ భర్త వీరన్నను 'సాక్షి' వివరణ కోరింది. ఏం పనులు చేశారో మాకేం తెలీదు.. కేవలం మాకు మెసేజ్ మాత్రమే వచ్చింది. డిజిటల్ కీ పంచాయతీ కార్యదర్శి దగ్గరే ఉంటుంది కదా అని సమాధానం ఇచ్చారు.

ఆర్టీఐ ద్వారా అడగండి ఇస్తా...

మొరసపల్లి, చాగలేరు, చిలమత్తూరు పంచాయతీల్లో ఏమేం పనులు చేశారో చెప్పండి అని 'సాక్షి' పంచాయతీ కార్యదర్శి రామ్లా నాయక్‌ను వివరణ కోరింది. ఆర్టీఐ ద్వారా అడగండి ఇస్తాను అని ఆయన సమాధానం ఇచ్చారు.



మొరసలపల్లి పంచాయితీలో సాకీబాయి ఖాతాల్లోకి నిధులు మళ్లిన వివరాలు

బాధిత కుటుంబానికి పరామర్శ



మారెన్న కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: మండలంలోని మావటూరుకు చెందిన మారెన్న ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం మావటూరుకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పరామర్శించారు. వారిని ఓదార్చి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామానికి చెందిన జమ్మానిపల్లి నాగరాజు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని పరామర్శించారు.

రాష్ట్రంలో దళితులకు రక్షణ కరువైంది

పెనుకొండ: 'రాష్ట్రంలో దళితులకు రక్షణ కరువైంది. కర్నూలు జిల్లా ఆదోని మండలంలోని నాగనాతనహళ్లి గ్రామానికి చెందిన దళిత మహిళ గుండమ్మను భూవివాదంలో అదే గ్రామానికి చెందిన పెత్తందార్లు దారుణంగా హత్య చేశారు. నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలి' అని కేవీపీఎస్, సీపీఎం నాయకుడు పెద్దన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుండమ్మ హత్య కేసులో ఉన్న శ్రీధరరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, మరో నలుగురు భూవివాదంలో గుండమ్మను ట్రాక్టర్‌తో తొక్కించి చంపేయడం దారుణమన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు రాజకీయ ఒత్తిడికి తలొగ్గి కేసు నమోదు చేసినా నిందితులను అరెస్ట్ చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే నిందితులను అరెస్ట్ చేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కంటి చూపును నిర్లక్ష్యం చేయొద్దు

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురం ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం గొల్లహట్టి, గోవిందాపురం గ్రామాల్లో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు, మహిళలకు కంటి పరీక్షలు నిర్వహించారు. పలువురికి కంటి శుక్లాలు ఉన్నట్లే గుర్తించారు. కంటి చూపుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. కంటి చూపును ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



కె.చంద్రశ్రీ

రొళ్ల: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కృష్ణమూర్తి, లక్ష్మీదేవి దంపతుల మొదటి కుమార్తె కె.చంద్రశ్రీ ట్రిపుల్ ఐటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)కి ఎంపికైనట్లు కుటుంబ సభ్యులు ఆదివారం సాయంత్రం తెలిపారు. కె.చంద్రశ్రీ రొళ్ల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 600 మార్కులకు 567 మార్కులు సాధించి మండల సెకండ్ టాపర్‌గా నిలిచింది. ఇటీవల విడుదల అయిన ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకోగ అందులో ఆర్కేవ్యాలి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ కళాశాలకు ఎంపికైందన్నారు. కళాశాలలో ఇంటర్‌తో కలిపి ఆరేళ్ల పాటు ఉచితంగా (బీటెక్) ఇంజినీరింగ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారన్నారు. చంద్రశ్రీని తల్లిదండ్రులతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అభినందించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం: మండల పరిధిలోని కొటిపి వద్ద అర్ధాంతరంగా నిలిచిపోయిన టిడ్కో ఇళ్లను ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదివారం పరిశీలించారు. టిడ్కో ఇళ్లకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో నూతన సబ్ స్టేషన్ ఏర్పాటుకు రూ.నాలుగు కోట్ల వ్యయంతో భూమి పూజ చేశారు. హిందూపురం మున్సిపల్ పరిధిలోని పరిగి బస్టాండ్ వద్ద రూ.44 లక్షల వ్యయంతో సీసీ రోడ్డుకు భూమి పూజలు చేశారు. పట్టణంలోని రైల్వేరోడ్డు సాయి బాబా ఆలయ వద్ద యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మీడియాతో ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడారు. మరో ఆరు నెలల్లో టిడ్కో ఇళ్ల పూర్తి చేస్తామన్నారు. అధికారంలో వస్తే హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా మారుస్తామని చెప్పారుగా జిల్లా కేంద్రం మార్పుపై ఉందా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం దాటవేశారు. అలాగే జేవీఎస్ ఎడ్యూకేషనల్ ట్రస్ట్ వెంకటస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్సు సేవలను ఎమ్మెల్యే ప్రారంభించారు.

భగవంతునిపై నమ్మకం ఉంచాలి



ప్రవచనాలు బోధిస్తున్న భక్తవృందదాస

హిందూపురం: భగవంతునిపై నమ్మకంతో, భక్తి భావంతో మెలగాలని భక్త వృందదాస అన్నారు. బెంగళూరు ఇస్కాన్ ఉపన్యాసకులు, ఆధ్యాత్మిక వేత్త భక్త వృందదాస ఆదివారం రాత్రి హిందూపురంలోని లయన్స్ క్లబ్‌లో భాగవతం ప్రవచనాలు చేశారు. అనంతపురం జిల్లాలో మొట్టమొదటిగా హిందూపురం నుంచి ఈ ప్రవచన కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. భాగవత దివ్య ప్రవచనం హృదయాలలో ఆధ్యాత్మిక ఆనందాన్ని, శాంతిని ప్రసాదిస్తుందని వివరించారు. అందరూ ఆధ్యాత్మికంగా భక్తిశ్రద్ధలతో దైవ చింతన కల్గి ఉండాలని సూచించారు. దేవుడు అలాంటి వారిని అన్నివేళలా కాపాడతారని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతకు ఆధ్యాత్మికంగా మార్గదర్శకత్వం వహించాలన్నారు.


మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ



వార్షిక సభలో మాట్లాడుతున్న మేరీ

రొద్దం: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో మొక్కలు పెంచితేనే భవిష్యత్‌లో మానవ మనుగడ సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం మండలంలోని కోగిర వనసంరక్షిత ప్రాంతంలో కల్పవల్లి వృక్ష పెంపకం దారుల పరస్పర సహాయ సహకా సంఘం 16వ వార్షిక సహసభను నిర్వహించారు. పలువురు సంఘం సభ్యులు మాట్లాడుతూ టింబక్టు-కలెక్టివ్ సహకారంతో గత 33 సంవత్సరాలుగా ఉమ్మడి భూముల సంరక్షణ, భూమి, నీరు, నారు, పర్యావరణ సమతుల్యత , వాతావరణంలోని మార్పులు తదితర అనేక అంశాలపై సభ్యులకు వివరించారు. చక్కభజన, అటవీ సంరక్షణపై ప్రదర్శించిన నాటకం అందరినీ అలరించింది. కార్యక్రమంలో సంస్థ స్థాపకులు మేరీ, గంగూలి, కల్పవల్లి సీఈఓ చిరంజీవి, కల్పవల్లి మేనేజర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కళావిహీనంగా పసరక్కర బావి



బావిలో విపరీతంగా పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కలు

పెనుకొండ: పట్టణంలో విజయనగర రాజుల కాలంలో నిర్మించిన పసరక్కర బావి కళావిహీనంగా మారింది. బావిలోని కట్టడం రాళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. బావిలో ఎక్కడ చూసినా పిచ్చిమొక్కలే దర్శనం ఇస్తున్నాయి. బావిలోకి దిగే పరిస్థితి సైతం లేదు. పురాతన కట్టడాల పరిరక్షణలో భాగంగా స్థానిక భోగసముద్రం జలవన పరిరక్షణ సమితి నాయకులు గతంలో చెరువును శుభ్రం చేసి బావిలోకి ఎవలోకి ఎవరూ దిగకుండా, వ్యర్థ పదార్థాలు వేయకుండా చుట్టూ ఇనుప కంచె వేయించారు. ప్రధాన మెట్లు దిగే ప్రాంతంలో పెద్ద ఇనుప గేట్లను వేసి తాళాలు వేశారు. అయితే బావిలో ప్రస్తుతం రాతి కట్టడాల మధ్య పెరుగుతున్న రావి, వేప చెట్లతో పాటు ఇతర పిచ్చి మొక్కల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇలాగే వదిలిపెడితే రాళ్లన్నీ విరిగిపోయి పురాటన కట్టడం కాలగర్భంలో కలిసిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఎంతో విశాలమైన బావిగా పసరక్కర బావికి పేరుంది. ఇప్పటికైనా పురావస్తుశాఖ అధికారులు స్పందించి బావిలోని పిచ్చి మొక్కలు, చెట్లు, వ్యర్థాలను తొలగించి పర్యాటక ప్రాంతంగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.



దండలు మార్చుకుని ఒక్కటైన దంపతులు

అవును .. వాళ్లిద్దరూ ఒక్కటయ్యారు

పావగడ: వివిధ కారణాలతో దూరమైన ఆలుమగలు చాలా కాలంగా విడి విడిగా ఉన్నారు. బంధువుల బుజ్జగింపులు, పెద్దల పంచాయతీలు సైతం వారిద్దరిని దగ్గర చేయలేకపోయాయి. చివరకు ఇద్దరూ కోర్టు మెట్లెక్కారు. ఈ నేపథ్యంలో శనివారం కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ పుణ్యమా అని తాలూకా న్యాయ సేవా సమితి అధ్యక్షుడు విమాదేశ్ నేతృత్వంలో వారిద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో మరోసారి వారిద్దరూ ఒక్కటవ్వాలని నిర్ణయించుకున్నారు. అక్కడే పూల దండలు మార్చుకొని నూతన జీవితానికి నాంది పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అడిషనల్ జడ్జి సుధీర్, అదనపు సివిల్ జడ్జి ప్రియాంక తదితర న్యాయవాదులు వారిని అభినందించారు. తమను ఒక్కటి చేసిన న్యాయమూర్తి, న్యాయవాదులకు వాళ్లిద్దరూ కృతజ్ఞతలు తెలియజేశారు.

గురుపౌర్ణమి వేడుకలు విజయవంతం చేయండి



సమావేశమైన మడకశిర పట్టణ ప్రముఖులు

మడకశిర: పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఈనెల 20, 21న గురుపౌర్ణమి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, విశ్రాంత డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ వేడుకలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆదివారం ఆలయంలో గురుపౌర్ణమి వేడుకల నిర్వహణపై చర్చించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, పట్టణ ప్రముఖులు, అన్ని వర్గాల నాయకులు, వివిధ సంఘాల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గురుపౌర్ణమి వేడుకలకు వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేడుకలు జరిగేలా చూడాలన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంతో మంది దాతలు వేడుకలకు పూర్తిస్థాయిలో సహకారం అందించారని పేర్కొన్నారు.

ఆలయంపై కూలిన చెట్టు



సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని పాత ఊరులో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంపై రావిచెట్టు కూలిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎన్నో ఏళ్ల చెట్టు కావడంతో ఆలయంపై కప్పుపై కొమ్మలు వాలాయి. భక్తులు, చుట్టుపక్కల ఎవరూ అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. చెట్టును తొలగించకపోతే ఆలయంపై పూర్తిగా చెట్టు కూలిపోయే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు.

ఇంటి పట్టాలు మంజూరు చేయండి

చిలమత్తూరు: 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లో తాము వేసుకున్న గుడిసెలకు పట్టాలు మంజూరు చేయాలని ఇళ్ల స్థలాల సాధన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బాలకృష్ణకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఎమ్మెల్యే బాలకృష్ణ నియోజకవర్గ పర్యటనలో భాగంగా మండలంలోని సోమఘట్టలో శుద్ధజల కేంద్రాన్ని ప్రారంభించారు. ఇంటి స్థలాలు ఇవ్వాలని హైకోర్టు ఆదేశాలున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ఇంటి స్థలాలు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు ప్రవీణ్ కుమార్, రమేష్, వెంకటేష్, లక్ష్మీనారాయణ, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వంట సామగ్రి పంపిణీ

రొద్దం: మండల పరిధిలోని పెద్దగువ్వలపల్లి గ్రామంలో వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో 121 నిరుపేద కుటుంబాలకు ఆదివారం వంట సామగ్రి పంపిణీ చేశారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణంలో సమావేశం ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు వంట చేసుకోవడానికి అవసరమయ్యే పాత్రలు, ప్లేట్లు, గ్లాసులు తదితర సామగ్రిని పంపిణీ చేశారు.

ఎక్కువ పోస్టులు భర్తీ చేయాలని వినతి

హిందూపురం టౌన్: హిందూపురం నియోజకవర్గంలో ఆదివారం పర్యటించిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు పలువురు సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందించారు. ఏపీ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాయలసీమ రీజినల్ జాయింట్ సెక్రటరీ పఠాన్ ఇమ్రాన్‌ఖాన్ ఆధ్వర్యంలో డీఎస్సీ 2024లో ఎస్జీటీ ఉర్దూ పోస్టులు ఎక్కువగా భర్తీ చేసేలా చూడాలని వినతిపత్రం అందించారు.

ఉచిత శిక్షణను ప్రారంభించనున్న సబ్‌కలెక్టర్

మడకశిర: పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ సోమవారం మడకశిరకు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని ఎస్వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటలకు డీఎస్సీ, ఎస్జీటీ అభ్యర్థుల ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, వివిధ శాఖల అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.